సాక్షి బాపట్ల

సోమవారం | 31 | జూలై | 2023



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి వచ్చే వరద వల్ల పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ ఆదివారం సాయంత్రానికి 32 టీఎంసీలకు చేరింది.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి ఆదివారం భక్తుడు వీరం జోత్స్నకుమార్ రూ. 1,01,015 విరాళంగా అందజేశారు.

బగళాముఖి అమ్మకు పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖ బండ్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

లలిత కళలతో మనోవికాసం



విజయవాడకల్చరల్: లలిత కళలతోనే మనోవికాసం కలుగుతుందని విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్ అన్నారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి.. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం స్వరలయ సౌరభ సంగీత కార్యక్రమం జాతీయ స్థాయి సంగీత పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంసీ దాస్ మాట్లాడుతూ సంగీత సాధనతో ఏకాగ్రత కలుగుతుందన్నారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పోటీతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సుబ్రహ్మణ్య సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీరావు మాట్లాడుతూ ఏటా సంగీతంలోని వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో మొదటి, రెండు స్థానాలు పొందిన వారు నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. విజేతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను నిర్వాహకులు అందజేశారు.

హంసలదీవిలో పర్యాటకుల సందడి



కోడూరు: భారీ వర్షాలు, అల్పపీడన ప్రభావంతో మూతబడిన హంసలదీవి సాగరతీరం గేట్లు ఆదివారం తెరిచారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు, అటవీ అధికారులు మూడు రోజుల నుంచి సాగరతీరాన్ని మూసి పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. ఆదివారం సెలవుదినం నేపథ్యంలో తీరంలో నిషేధాజ్ఞలను అధికారులు తొలగించి పర్యాటకులను బీచ్ వద్దకు అనుమతించారు. ఇతర ప్రాంతాల నుంచి యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో సాగరతీరానికి తరలివచ్చి సందడి చేశారు. చిన్నారులు, యువకులు సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. మెరైన్ పోలీసులు తీరంలో గస్తీ నిర్వహించి, సముద్ర స్థితిగతులపై పర్యాటకులకు అవగాహన కల్పించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 515.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. కుడి కాలువకు నీటిని నిలుపుదల చేశారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 846.20 అడుగుల వద్ద ఉంది. జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 40,644, రోజా 1,310 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

చెరువులో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

చిలకలూరిపేటటౌన్: చెరువులో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన గండి వంశీ(24) డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులతో కలసి పక్కనే కుక్కపల్లివారిపాలెం అయినగుంట చెరువులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో అతనితో వెళ్లిన ఇద్దరు స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరుకోగా వంశీ చెరువులో గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు వంశీ కోసం గాలిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్త మందిరంలో అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని 11 రోజుల పాటు అనంత విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం పూర్తయిన సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులు శ్రీ గంభీరానందస్వామి పాల్గొని అనుగ్రహభాషణ చేశారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ సంఘం, వి.జ.య. సంఘం, రామలింగ సేవా సమితి, చిలుమూరు వారి సంయుక్త నిర్వహణలో కార్యక్రమం ఏర్పాటైంది. గాయత్రీ మందిరం కమిటీ అధ్యక్షుడు రాళ్లబండి వేంకట సత్య రామాంజనేయశర్మ పర్యవేక్షించారు.

అబద్ధాల ‘గళం’

- అద్దంకి సభలో అన్నీ కోతలే
- గొప్పలుపోయిన లోకేష్
- వినలేక వెనుదిరిగిన జనం
- చినబాబు ‘ఈవెనింగ్ వాక్’ నవ్వులపాలు



లోకేష్ మాట్లాడుతుండగా వెనుదిరిగి వెళ్లపోతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తనతండ్రి చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసమ్యలను పట్టించుకోకుండా ఇప్పుడు రాబోయే ఎన్నికల్లో ఓట్లేసి గెలిపిస్తే అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తానంటూ తెలుగుదేశం చినబాబు లోకేష్ అద్దంకి సభలో కోతలు కోయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఆద్యంతం అబద్ధాలు వల్లెవేయడంపై ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. వాటిని వినలేక వెనుదిరిగారు.

యువగళం పాదయాత్రలో భాగంగా అద్దంకిలో పర్యటిస్తున్న లోకేష్ రెండోరోజు ఆదివారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో అద్దంకి శివారులోని మధురానగర్ నుంచి ఈవెనింగ్ వాక్ ప్రారంభించారు. 6:40 గంటలకు అద్దంకి పాతబస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణానికి చేరుకున్నారు. 6:45 గంటలకు లోకేష్ ప్రసంగించారు. ప్రారంభం నుంచే అబద్ధాలు వల్లెవేశారు. చంద్రబాబు హయాంలో అభివృద్ధి జరిగిందంటూ కోతలు కోశారు. అద్దంకిలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేశామని గొప్పలు పోవడంతో సభకొచ్చిన జనం ముక్కున వేలేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తుంటే అక్రమాలు జరిగాయంటూ లోకేష్ నిందలు వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెడ్ బుక్ బెదిరింపు

తాము అధికారంలోకి వస్తే తమకు అనుకూలంగా మసలుకోని పోలీసులు, అధికారుల సంగతి చూస్తామంటూ లోకేష్ బహిరంగ వేదికపై నుంచే బెదిరింపులకు దిగడం చర్చనీయాంశంగా మారింది. అందరి పేర్లు రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నామని, అధికారంలోకి రాగానే ఉద్యోగాలు ఊడబెరికి జైలుకు పంపుతామంటూ లోకేష్ బెదిరించడంపై ఆయా వర్గాల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యువగళం సభలో లోకేష్ ప్రసంగం ప్రారంభంకాగానే సభకు వచ్చిన జనం వెనుదిరిగి వెళ్లడం ప్రారంభించారు. ప్రసంగం సగం కూడా పూర్తి కాకముందే ప్రాంగణం ఖాళీ అయింది. ఫలితంగా లోకేష్ యాత్ర అట్టర్‌ఫ్లాప్ అయింది.

బాబు హయాంలో అంతా అన్యాయమే

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అద్దంకి తాగునీటి కోసమంటూ రూ.85 కోట్లతో పథకాన్ని తెరపైకి తెచ్చి ఆ తరువాత పట్టించుకోలేదు. ఇప్పుడు ఓట్లు వేసి గెలిపిస్తే ఆ పథకాన్ని పూర్తి చేస్తామంటూ లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉంది.

- జలసిరి పథకంలో భాగంగా మొక్కుబడిగా బోర్లు వేసి వాటికి మోటార్లు కూడా బిగించలేదు.
- ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు రాయితీ మోపెడ్లు, వలలు ఇస్తున్నామని చెప్పి తమ పార్టీకి చెందిన కొందరికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు.
- యర్రం చిన్నపోలిరెడ్డి పథకాన్ని తుంగలో తొక్కారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే దానిని పూర్తిచేస్తామంటూ లోకేష్ చెప్పడంపై రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.
- అధికారంలో ఉన్నప్పుడు గ్రానైట్ పరిశ్రమకు మొండిచేయి చూపి ఇప్పుడు రాయల్టీ తగ్గిస్తామని కోతలు కోయడంపై వ్యాపార వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది.
- వెలుగొండపైనా లోకేష్ అబద్ధాలు చెప్పడం, దొనకొండను పారిశ్రామిక వాడగా మారుస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉందనే వాదన వినిపించింది.

వైఎస్సార్ సీపీ వచ్చాకే ప్రగతి



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకే అద్దంకి పట్టణ అభివృద్ధి జరిగింది. తాగునీటి కోసం రూ.80 కోట్లతో చేపట్టిన పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ, డివైడర్‌లు, సెంటర్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులన్నీ పూర్తిచేశాం. లోకేష్ సభ జరిగిన ప్రాంతాన్నీ సుందరంగా తీర్చిదిద్దాం. పట్టణంలో 70 ఎకరాల్లో మూడు లేఅవుట్లు వేసి దాదాపు 3వేల మందికి ఇళ్లస్థల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం. రూ.10 కోట్లతో మినీ బైపాస్ రోడ్డును నిర్మిస్తున్నాం. మున్సిపాలిటీని కార్పొరేషన్ స్థాయికి తీసుకెళ్తున్నాం.

– బాచిన కృష్ణచైతన్య, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్

జగన్ వచ్చాకే అభివృద్ధి

వాస్తవానికి బాబు హయాంలో అద్దంకి పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీలు అధ్వానంగా ఉండేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అద్దంకి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. నామ్ రహదారిని విస్తరించారు. ప్రధాన రహదారులలో డివైడర్లు ఏర్పాటు చేశారు. డ్రెయిన్స్ నిర్మించారు. సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకం, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, జిమ్ పాయింట్, పార్కు, జగనన్న మహిళా మార్టు ఏర్పాటు చేశారు. సింగరకొండ దేవస్థానం అభివృద్ధి చేశారు.

తెలుగు పదాలు ఖూనీ

లోకేష్ తన ప్రసంగంలో ఎప్పట్లానే తెలుగు పదాలను ఖూనీ చేశారు. బీసీ సోదరులు బదులు బీసీ చౌదరులు అంటూ పదేపదే చెప్పారు. యాంకర్ ఉదయభానును ఉదయ్‌బాబుగా ప్రస్తావించడంతో జనం నవ్వుకున్నారు. కార్యక్రమంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కనిగిరి టీడీపీ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

3 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు



నల్లపాడులోని హెల్ప్‌లైన్ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్–2023 ద్వారా ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఈఏపీ సెట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు భౌతికంగా హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన విద్యార్థులు ఆగస్టు 3 నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంది. దీని కోసం ఎస్‌ఈటీఎస్.ఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌కు లాగిన్ కావాలి. ఆప్షన్ల నమోదుకు 8వ తేదీ వరకు అవకాశం ఉంది. 9వ తేదీలోపు ఆప్షన్లు మార్చుకోవచ్చు. 12న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకుని ఆగస్టు 13, 14వ తేదీల్లో కళాశాలల్లో రిపోర్టు చేయాలి. 16న కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతోపాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటివద్ద ఆన్‌లైన్ సదుపాయం లేని విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలకూ వెళ్లవచ్చు.

పరాశక్తి లలితా.. శివానంద చరితా..



దుర్గమ్మను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

- ఇంద్రకీలాద్రిపై ఆదిదంపతులు ఆర్జిత సేవలకు డిమాండ్
- మహామండపం మీదుగా రాకపోకలు



సరస్వతీ యాగంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పరాశక్తి లలితా.. శివానంద చరితా అంటూ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను భక్తజనం కనులారా తిలకించి మనసారా ప్రార్థించారు. ఆదివారం మూలా నక్షత్రం పురస్కరించుకుని కనకదుర్గమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మరో వైపున అమ్మవారి దర్శనానికి సాధారణ రద్దీ కనిపించింది. అమ్మవారి దర్శనం గంటలోనే పూర్తి కాగా, భక్తులు కుటుంబ సమేతంగా ఆలయ ప్రాంగణంలో గడిపారు. కొండరాళ్లు జారిపడే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు ఘాట్‌రోడ్డును మూసివేశారు. మహామండపం మీదుగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. దర్శనం తర్వాత మల్లేశ్వరస్వామి ఆలయం మీదుగా కొండ దిగువకు చేరుకున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీయాగం

మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారి సన్నిధిలో సరస్వతీయాగం చేశారు. తొలుత కలశ స్థాపన, అనంతరం యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

సూర్యోపాసన సేవ

లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యోపాసన సేవ చేశారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించారు.

ఆర్జిత సేవలకు డిమాండ్

శ్రీదుర్గామల్లేశ్వరస్వామికి నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి జరిగిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, నవగ్రహ హోమాల్లో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టింది.

మహా మండపం మీదుగా కొండపైకి

గత వారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో దుర్గగుడి ఘాట్‌రోడ్డును మూసివేసిన సంగతి తెలిసిందే. ఆదివారం కూడా ఘాట్‌రోడ్డును మూసివేసిన దేవస్థాన అధికారులు, మహామండపం మీదుగానే భక్తులను కొండపైకి అనుమతించారు. మహామండపం మెట్లు, లిఫ్ట ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. ఘాట్‌రోడ్డును మూసివేయడంతో చైనా వాల్, ఓం టర్నింగ్, లక్ష్మీ గణపతి ప్రాంగణాలు వెలవెలబోయాయి. ఆదివారం రాత్రి కూడా వర్షం కురవకపోతే సోమవారం ఘాట్‌రోడ్డును తెరిచే అవకాశాలున్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

కుడి కాలువకు నీరు నిలిపివేత



విజయపురిసౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు ఈనెల 20న తాగునీటి అవసరాల నిమిత్తం ఐదు టీఎంసీల నీటిని నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు కేటాయించింది. నీటి విడుదల పూర్తి కావటంతో కుడి కాలువకు ఆదివారం అధికారులు నీటిని నిలిపివేశారు. మధ్యాహ్నం కుడి కాలువకు విడుదలవుతున్న 4,848 క్యూసెక్కులను ఒంటి గంట నుంచి గంటకు 1,000 క్యూసెక్కుల చొప్పున తగ్గిస్తూ సాయంత్రం ఐదు గంటలకు పూర్తిస్థాయిలో నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 515.10 అడుగుల వద్ద ఉండగా ఇది 140.4917 టీఎంసీలకు సమానం.

రైలు ఢీకొని తల్లీకూతుళ్లు మృతి

నెల్లూరు(క్రైమ్): మూత్ర విసర్జనకు పట్టాల మీద నడుచుకుంటూ వెళ్తున్న తల్లీకూతుళ్లు రైలు ఢీకొనడంతో మృతి చెందారు. ఈ హృదయ విదారక ఘటన ఆత్మకూరు బస్టాండు సమీపంలో రైలు పట్టాలపై ఆదివారం సాయంత్రం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ఫాతిమా అలియాస్ ఫాతిమున్నీసా(60)కు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహమైంది. పెద్ద కుమార్తె మెహరున్నీసా శింగరాయకొండ, చిన్నకుమార్తె గౌసియా(35) కందుకూరులో ఉంటున్నారు. రొట్టెల పండగకు తల్లీకూతుళ్లు కలిసి ఆదివారం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకొచ్చారు. దర్గాను సందర్శించుకుని హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో మెహరున్నీసా రైల్వేస్టేషన్‌లో ఉండగా ఫాతిమున్నీసా, గౌసియా మూత్రవిసర్జన చేసేందుకు రైలుపట్టాల వెంబడి ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లారు. రైల్వే బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి నిజాముద్దీన్ వెళ్తున్న రైలు వారిని ఢీకొంది. ఫాతిమున్నీసా అక్కడికక్కడే మృతి చెందగా గౌసియా రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు 108 సాయంతో చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసియా మృతి చెందింది. తల్లి, చెల్లెలు మృతితో మెహరున్నీసా కన్నీటిపర్యంతమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై ఎస్.హరిచందన పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు నెల్లూరుకు బయలు దేరారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

పికెట్ ఏర్పాటు

గతంలోనూ ఇదే ప్రాంతంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. రైల్వే పోలీసులు గస్తీని ఏర్పాటు చేసి అటువైపు వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేస్తున్నా.. ప్రయాణికులు పెడచెవిన పెట్టి రైలు పట్టాలపై రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. ఆదివారం తల్లీకూతుళ్లు రైలుపట్టాలపై వెళుతుండగా, అటుగా వెళుతున్న వారు వారిస్తుండగానే రైలు వారిని ఢీకొంది. దీంతో రైల్వే పోలీసులు అక్కడ పికెట్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులు అటుగా వెళ్లకుండా చర్యలు చేపట్టారు.



ఘటనా స్థలంలో ఫాతిమున్నీసా మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ హరిచందన

భలే మంచి చౌక బేరం

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

- నిత్యావసర ధరల కట్టడికి ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో 13 కౌంటర్లు ఏర్పాటు చేసిన పౌర సరఫరాల శాఖ



నరసరావుపేట మార్కెట్ యార్డులో బియ్యం, కందిపప్పు విక్రయ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్ (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: నిత్యావసర ధరల కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేసే లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. దీనిలోభాగంగా మిల్లర్లు, టోకు వ్యాపారుల సహకారంతో సబ్సిడీ ధరలకే గ్రేడ్–1 బీపీటీ బియ్యం, గ్రేడ్–1 కందిపప్పు విక్రయానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మిల్లర్లు, టోకు వ్యాపారులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తోంది. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పౌర సరఫరాలశాఖ ఈ ప్రత్యేక కౌంటర్లను పర్యవేక్షిస్తోంది. మార్కెట్ ధర కంటే 15 నుంచి 20 శాతం తక్కువకే నాణ్యమైన బియ్యం, కందిపప్పును విక్రయిస్తోంది.

జిల్లాలో 13 ప్రత్యేక కౌంటర్లు

పల్నాడు జిల్లా వ్యాప్తంగా నరసరావుపేట, గురజాలలో రెండు చొప్పున, చిలకలూరిపేట, మాచర్ల, దుర్గి, పిడుగురాళ్ల, కారంపూడి, క్రోసూరు, సత్తెనపల్లి, వినుకొండ, దాచేపల్లిలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 13 ప్రత్యేక కౌంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఇతర ప్రాంతాలకూ కందిపప్పు సరఫరా

పల్నాడు జిల్లాలో కందిపప్పు మిల్లులు ఎక్కువగా ఉండటంతో వాటి ద్వారా తక్కువ ధరకే అమ్మకాలు సాగించడంతోపాటు, ఇతర జిల్లాలకూ తరలించి తక్కువ ధరకు అందించేలా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చర్యలు చేపట్టారు. మరోవైపు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి నిత్యావసర ధరలను పెంచకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. వ్యాపారుల వద్ద సరుకుల నిల్వలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ వెబ్‌సైట్లలో నమోదు చేసేలా చూస్తున్నారు. నిల్వలు అధికంగా ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

బియ్యం కిలో రూ.48కి..

జిల్లాలో 13 కౌంటర్లలో బీపీటీ బియ్యం గ్రేడ్–1 రకం కిలో రూ.48 చొప్పున ఇప్పటి వరకు 698 మందికి 10,253 కిలోలు విక్రయించారు. బయట మార్కెట్‌లో ఈ రకం బియ్యం కేజీ రూ.60 వరకు పలుకుతోంది. కందిపప్పు ధర ప్రాంతాలను బట్టి మారుతోంది. కందిపప్పు మిల్లులు అధికంగా ఉన్న మాచర్లలాంటి ప్రాంతాల్లో కిలో రూ.120, నరసరావుపేటలో కిలో రూ.135 వరకు అమ్ముతున్నారు. బయట మార్కెట్‌లో ఈ రకం కందిపప్పు కిలో రూ.180 వరకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఇప్పటి వరకు 3,488 మందికి రూ.5,812 కిలోల కందిపప్పును విక్రయించారు.

ఎంతో ఉపయోగం



ప్రస్తుతం బియ్యం, కందిపప్పు ధరలు మండిపోతున్నాయి. నిత్యావసర వస్తువుల కొనుగోలుకే ఎక్కువ డబ్బు ఖర్చు అవుతోంది. ఇటువంటి సమయంలో ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను విక్రయించడం పేద, మధ్యతరగతివర్గాలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–పి.సుశీల, వైఎస్సార్ కాలనీ, చిలకలూరిపేట

తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు



పేద, మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరలో నాణ్యమైన సరుకులు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. వీటికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకోవాలి. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుకు సహకరించిన మిల్లర్లు, టోకు వ్యాపారులకు ధన్యవాదాలు.

– శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్, పల్నాడు జిల్లా

క్లుప్తంగా

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

బాపట్లటౌన్: జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లు, పాతనేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తులు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, అలా కాదని చట్టాన్ని తన చేతిలోకి తీసుకోని నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా, చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు, ఇతర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తన కలిగి ఉండి, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని పోలీసులు సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల పై నిరంతరం నిఘా ఉంటుందని, చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో పీడీ చట్టం అమలు పరచి జిల్లా బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడబోమని పోలీసు అధికారులు హెచ్చరించారు.

అయ్యప్ప భక్తిగీతాల కచేరి రేపు

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో 'నీ గానమే నా ప్రాణం' అనే అయ్యప్ప స్వామి భక్తి పాటల కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మున్నం లక్ష్మణ్ రెడ్డి స్వామి ఆదివారం తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 5 గంటలకు కాషాయ ధ్వజారోహణం, స్వదేశీ గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన అనంతరం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ నామ సంకీర్తన, నిర్విరామంగా అయ్యప్ప స్వామి భక్తి పాటలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన అయ్యప్ప స్వామి భక్తి పాటల గాయకులు డప్పు శ్రీను, శివగురుస్వామి, గౌరి శంకర్ స్వామి, హరినాథగురుస్వామి, భాస్కర స్వామి, రేపల్లె ఎన్వీ స్వామి, వాసు గురు స్వామి, కుమారస్వామి, మల్లి స్వామితో పాటు పలువురు గాయకులు పాల్గొంటారని వివరించారు. అనంతరం గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనం, అతిథులకు సత్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రాకర్స్‌పడి పందిరి దగ్ధం

అద్దంకి రూరల్: లోకేష్ పాదయాత్రలో తెలుగు తమ్ముళ్లు కాల్చుతున్న క్రాకర్స్ పందిరిపై పడి మంటలు చెలరేగిన సంఘటన అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లోకేష్ యువగళం పాదయాత్ర అద్దంకిలో సభ ముగించుకుని తిమ్మాయపాలెం మీదగా దర్శి రోడ్డుకు వెళుతున్న సమయంలో తెలుగుదేశం మద్దతుదారులు దారి వెంట భారీగా క్రాకర్స్ కాల్చుతుండగా మార్గంమధ్యలోని తిమ్మాయపాలెం గ్రామంలో రోడ్డు వెంబడి ఎస్సీ కాలనీ వాసులు ఏర్పాటు చేసుకున్న చిన్నదుకాణం ముందు ఉన్న పందిరిపై పడ్డాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. దారి పక్కనే ఏమి ఉన్నాయో అని కూడా చూడకుండా క్రాకర్స్ కాల్చటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి అందరూ ఉండటంతో పెనుప్రమాదం తప్పిందన్నారు.

తీరనున్న చిరకాల స్వప్నం

తీరప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్. రూ.451 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయితే తీరప్రాంత రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. రెండు వైపులా కలిపి మూడు కిలో మీటర్ల మేర బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు జరగాల్సి ఉండగా ఒకవైపు ఇప్పటికే 1.2 కిలోమీటర్ల నిర్మాణం జరిగింది. రెండోవైపు 1.3 కోలోమీటర్ల మేర పనులు జరిగాయి. కాంక్రీటుతో బ్రేక్‌వాటర్ నిర్మాణ పనులు కొంతమేర జరిగాయి. దీనికి తోడు డ్రెడ్జింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన నాటి నుంచి శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. ఈ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పూర్తయితే.. తీర ప్రాంతంలోని వేలాది మందికి ఉపాధి లభించనుంది.

–నిజాంపట్నం



హార్బర్ నిర్మాణ పనుల ఏరియల్ వ్యూ



హార్బర్‌లో జరుగుతున్న జెట్టీ నిర్మాణ పనులు



కోతకు గురికాకుండా అంచున ఏర్పాటు చేసేందుకు పోసిన కాంక్రీట్ దిమ్మెలు



వేగంగా బ్రేక్‌వాటర్ నిర్మాణ పనులు



కాంక్రీట్‌తో బ్రేక్ వాటర్ పనులు

కొండవీటి చరిత్రపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: కొండవీటి రెడ్డిరాజుల చరిత్రపై అవగాహన అవసరమని కొండవీటి కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి అన్నారు. మండలంలోని హౌస్ గణేష్ గ్రామ పరిధిలోని కొండవీటి రెడ్డి రాజుల మ్యూజియాన్ని ఆదివారం కాకినాడ రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సందర్శించారు. వారికి రెడ్డిరాజుల ప్రాశస్త్యాన్ని, విశిష్టతను శివారెడ్డి వివరించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన వస్తువులు, కోట నమూనాలు, రెడ్డిరాజుల కాలంనాటి సామగ్రి, నాణేలు, కత్తులు, ఆభరణాలు, వంటపాత్రలు, రెడ్డిరాజుల విగ్రహాలు వారిచరిత్రను గురించి తెలియజేశారు.

ఆపస్ జిల్లా అధ్యక్షుడిగా బాల చంద్రారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాల చంద్రారెడ్డి, శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. ఆదివారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఆపస్ జిల్లా అభ్యాస వర్గ సమావేశంలో భాగంగా జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బలరామకృష్ణ మాట్లాడారు. డీవైఈఓ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.సంఘం రాష్ట్ర కోశాధికారి ఎ.సురేష్‌కుమార్, నాయకులు జి.శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాసరావు, వై.వీరబాబు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



నూర్ అప్సర్(ఫైల్)

ముండ్లమూరు: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ముండ్లమూరుకు చెందిన షేక్ కాలేషా, మహబూబి దంపతుల రెండో కుమార్తె నూర్ అప్సర అలియాస్ బుజ్జి(27). తండ్రి ఆమె చిన్నతనంలోనే మృతి చెందాడు. అద్దంకి మండలం వేలమూరిపాడు గ్రామానికి చెందిన కాలింత కిరణ్‌కుమార్‌ను ప్రేమించి పెద్దలను ఎదిరించి వివాహం చేసుకుంది. కొంతకాలానికి తల్లి కూడా మరణించింది. కొన్నేళ్లపాటు వీరి కాపురం సజావుగానే సాగింది. కిరణ్‌కుమార్ అద్దంకిలోని బంగ్లా రోడ్డులో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. నూర్‌అప్సర ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తోంది. ఇటీవల దంపతుల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో నూర్ అప్సరను కిరణ్‌కుమార్ వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. మనస్తాపం చెందిన నూర్ అప్సర ఆదివారం ఉదయం వేలమూరిపాడు నుంచి ముండ్లమూరు వచ్చింది. పిల్లలు తొమ్మిదేళ్ల నిషిత, ఏడేళ్ల సంగీత ఏడుస్తూ వెంటపడినా పట్టించుకోకుండా వారిని అక్కడే వదిలేసి వచ్చింది. ముండ్లమూరులోని తమ ఇంటి ఆవరణలో ఉన్న వేపచెట్టుకు అట్లతద్దె సమయంలో ఏర్పాటు చేసిన ఊయల తాడుకు ఉరేసుకునేందుకు సిద్ధమైంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సీకాలనీకి చెందిన ఒక మహిళ, నూర్ అప్సర వద్దకు వచ్చి కాసేపు కూర్చుని వెళ్లింది. పక్కనే చర్చి ఉండటంతో ఆదివారం ప్రార్థనలకు వచ్చిన మహిళలు ఇళ్లకు వెళ్లేంత వరకు ఆగింది. ఆ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న తొట్టెను వేపచెట్టుకు వేలాడుతున్న తాడు వద్దకు తెచ్చుకుని మెడలో ఉన్న బంగారు భరణాలు హ్యాండ్‌బ్యాగ్‌లో వేసి ఉరేసుకుంది. ఉరేసుకునే ముందు భర్తకు చెట్టుకు వేలాడుతున్న తాడు ఫొటో, ఆ ప్రాంతం ఫొటోలను వాట్సాప్‌లో పంపినట్లు తెలిసింది. చెట్టుకు మృతదేహం వేలాడుతుండగా, సాయంత్రం అటుగా వెళ్లిన కొందరు చూసి చుట్టుపక్కల వాళ్లకు చెప్పారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ యూవీ కృష్ణయ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ముగ్గురు తోడబుట్టిన వారు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



పాత గుంటూరు: నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణయ్య అన్నారు. ఆదివారం పాత గుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవ ప్రసాదరావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నారాయణస్వామి, వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గోరిజవోలులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నాదెండ్ల: భారత దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని గోరిజవోలు ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, విభిన్న కులమతాలతో భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశానికి సమగ్రమైన రాజ్యాంగం అందించి దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు దోహదపడిన మహనీయుడు అని అన్నారు. కుల వివక్ష, అంటరానితనం రూపుమాపేందుకు పోరాటం చేశారన్నారు. ఎంతో ముందుచూపుతో ఆయన రిజర్వేషన్లను ఏర్పాటు చేసి అన్ని వర్గాల్లో సమాజంలో సమానంగా ఎదిగేందుకు దోహదపడ్డారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రజలు పాటుపడాలని, సుసంపన్న భారతదేశాన్ని నిర్మించేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, చిలకలూరిపేట మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీల అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంటటరెడ్డి, నాయకులు అల్లడి రవి కుమార్, కె రామకృష్ణయ్య, పత్తి వెంకట్, పర్వతనేని బ్రహ్మయ్య, మొక్కపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహనీయుడు...

వందేళ్లగా కుల వివక్ష, అంటరానితనానికి గురైన జాతులను విముక్తం చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ చెప్పారు. గోరిజవోలు గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న దళితులకు హక్కులు ప్రసాదించి, అన్ని రంగాల్లో ఎదిగేందుకు ఏర్పాట్లు చేసిన దార్శనికుడు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళిత బహుజనులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని వివరించారు. అనంతరం విక్టర్ ప్రసాద్‌ను స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి గొర్రెపాటి గృహలక్ష్మి, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీటీసీ గారపాటి సుహాసిని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ జంగం చంద్రశేఖర్, జంగం బాజి, కంచడం శివ, శ్యామ్‌పాల్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్

డాక్టర్ తేజశ్వికి గోల్డ్ మెడల్

గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో కార్డియాలజిస్ట్‌గా సేవలందిస్తున్న డాక్టర్ జె.తేజశ్వికి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ లభించింది. డీఎం కార్డియాలజిస్ట్ కోర్సులో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచినందుకు వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ అందజేసింది. అత్యాధునిక కార్డియాలజీ వైద్యసేవలను ప్రజలందరికీ చేరువ చేస్తానని డాక్టర్ తేజశ్విని తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పాత గుంటూరు: విద్యుత్ సంస్థలలో వేతన సవరణకై కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణకు, ఇతర ప్రధాన సమస్యల పరిష్కారానికై విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఐక్య కార్యాచరణ కమిటీలు ఆగస్టు 10వ తేదీ తరువాత సమ్మె నిర్వహించాలని పిలుపునిచ్చాయి. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సభకు కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ నాగబ్రహ్మాచారి అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం చిన్నచూపు చూస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదీ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఆగస్టు 2వ తేదీ ఎస్ఈ ఆఫీసుల వద్ద ర్యాలీ నిర్వహించాలని, ఆగస్టు 10నుంచి సమ్మెలోకి వెళ్లాలని, ఆగస్టు 17వ తేదీన చలో విద్యుత్ సౌద నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న ఈ పోరాటాలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, ఉద్యోగసంఘం నాయకులు, వీవీకే సురేష్, కిషోర్, సలీమ్, జి.వెంకట్రావు, దాసరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి



పొన్నూరులో శాంతి ర్యాలీ చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు



చేబ్రోలులో జరిగిన శాంతి ర్యాలీలో దళిత నాయకులు

మణిపూర్ ఘటనను నిరసిస్తూ.. పొన్నూరు, చేబ్రోలులో భారీ ర్యాలీలు

చేబ్రోలు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన అమానుష దాడులను ఖండిస్తూ పొన్నూరు, చేబ్రోలు ప్రాంతాల్లో ఆదివారం దళిత, ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు, పాస్టర్స్ ఫెలోషిప్, లౌకికవాదులు, మానవతా వాదుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు, జాతీయ జెండా పట్టుకొని సంఘీభావ శాంతి ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు మండలంలో నారాకోడూరు నుంచి చేబ్రోలు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. పొన్నూరు అంజుమన్ కమిటీ, యునైటెడ్ ఫ్రంట్, నిడుబ్రోలు- పొన్నూరు పాస్టర్స్ ఫెలోషిప్, దళిత మహాసభ, మాల మహాసభ, ఈబీహెచ్, ఏఈఎల్సీ, ప్రజా సంఘాలు, దళితులు. ముస్లింలు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పొన్నూరు, చేబ్రోలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై అమానుష హత్యాకాండకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికార మదంతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులకు రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఫాదర్ ఎల్ఎక్స్, మౌలానా అల్తాఫ్ మురాది, షేక్ సైపుల్లా, షేక్ మహమ్మద్ (మాము), రెవరెండ్ కె.ఆశీర్వాదం, డాక్టర్ టి.రాజారావు, జక్కా శ్రీనివాస్, ఫాదర్ రామారావు, నాజర్, మల్లెల వెంకట్రావు, అక్కిదాసు జాషువా, జోసఫ్, ఆరేటి రామారావు, మనోరంజని పాల్గొన్నారు. సభలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు, ముస్లిం, క్రైస్తవ మహిళలు, మానవతా వాదులు, లౌకికవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.